# జా న కి

రామారావుని చూడగానే ఆ కొత్తవూళ్ళో వెంటనే తనకి బాల్య స్నేహితుడు దొరికాడు కదా అని సూర్యనారాయణకి చాలా సంతోషమయింది. తక్కిన మనుష్యులెవ్వరూ క్లబ్బులో లేనట్లే అనుకుని యిద్దరూ బిలియర్డ్సు గదిలో మూల కూర్చుని కాలేజి స్నేహితమంతా పునశ్చరణ చేసుకున్నారు. యిద్దరూ ఒక గదిలో వుండి ఒకరి డబ్బు యింకొకరిదిగా వాడుకుని, రెండోవారికి తెలియని రహస్యాలు లేకుండా నాలుగేళ్ళు గడిపి, నాలుగేళ్ళ అయింది. వాళ్ళమాటలు వింటే యిన్నాళ్ళు వొకర్ని విడిచి వొకరు యెట్లా విడిగా బతకగలిగారో అనుకుని వుంటారు. మర్నాడు రామారావు సూర్యనారాయణని కలుసుకోగానే.

"మీ నాన్నగారు రామచంద్రపురంలో డాక్టరుగా వున్నారుట కదూ కొంతకాలం" అని అడిగాడు.

ఆ సంగతి సూర్యనారాయణ వొప్పుకున్న తరవాత.

"ఆయన పేరు రామస్వామి నాయుడుగారు. అవునా?"

"అవును"

"అయితే జానకి నిన్ను బాగా యెరుగునుట కదూ?"

జానకి! జానకి! అర్థం తెలీకండానే ఆ మాటలు వినేటప్పటికి సూర్యనారాయణ మనసు ఝల్లుమన్నది. జానకి!

"జానకి? ఏ జానకి?" అంటూ వుండగానే తనకే నిశ్చయింగా తెలిసిపోయింది. జానకి వొక్కతే తన ప్రపంచంలో.

"సబ్ జడ్జి పని చెయ్యాలా. రామచంద్ర..."

తెలిసిందిలే. జ్ఞాపకమొచ్చింది. అయితే జానకి నీకెట్లా తెలుసు ?"

జానకి తను గోషాలో దాచుకున్న తురకభార్యలాగూ, జానకి పేరైనా యితరులు వుచ్చరించడం నేరమైనట్లూ అన్నాడామాట సూర్యనారాయణ.

"యెట్లా తెలుసా? యెట్లాగో కొంచెం తెలుసుననుకుంటా. జానకి నా భార్య గనక?"

నీ భార్యా! జానకి నీ భార్యా!"

యెవరిభార్య కావడమూ ఘోరమైన విపత్తని జానకి యెప్పుడూ అటువంటి నీచమైన కార్యము చేస్తుందని తను అనుకోనట్టు వినపడ్డాయి అతనిమాటలు. నాలుగుముహూర్తాలలో బయస్కోపులో మల్లే సూర్యనారాయణ కళ్ళముందు బాల్యనాటకంలో ముఖ్యమైన ప్రకరణాలు గిర గిర తిరిగిపోయినాయి. చిన్నప్పటి సంగతులన్నీ చాలవరకు మరచిపోయినాడు గాని జానకితో సంబంధించిన నిమిషాలు మాత్రం మెరుగు పెట్టినట్లు మరపు చీకట్లోంచి తళతళలాడుతో కనపడ్డాయి.

చిన్నప్పుడు సూర్యనారాయణ చెల్లెలికీ, జానకికీ స్నేహం మొదట. వీళ్ళు నాయుళ్లూ, వాళ్ళు బ్రాహ్మలూ. బలిచెడుగుడు ఆడి అలిసి, చంద్ర వంక తెలుపూ, రాత్రి నలుపూ మబ్బుల మీదనించి మొహాలమీద పడే పసుపూ, కలిసే ఒక వింతసంధ్యలో సూర్యనారాయణ యింటికి పరిగెత్తు కుని వస్తున్నాడు. దొడ్డితడిక దగ్గిర వొకత్తా నుంచుని, తగ్గిపోతున్న కాంతి కోసం దుఃఖించే వనకన్యలాగు, జానకి కనపడ్డది. కళ్ళనికప్పిన గుప్పెట్లు కన్నీళ్ళతో తడిశాయి.

"ఎందుకూ జానకీ యేడుస్తున్నావు?"

"నా వుంగరం పడిపోయింది యిక్కడ. సీతమ్మ ఆటలో వేలుపట్టు కుని లాగింది"

"మరి వాళ్ళందరు యేరీ ?"

"వెతికాము. కనపడ లేదు. వాళ్ళమీది కొస్తుందని పారిపోయారు... అమ్మ కొడుతుంది"

సూర్యనారాయణా, జానకీ మళ్ళీ వెతికారు. అతను లాంతరు తీసు కొస్తానంటే వొద్దంటుంది. కాని వుంగరం దొరకంది యింటికి వెళ్ళ నంటుంది. పడమట ఒక్క మెరుపు మెరిసింది. తలమీద అంగారకుడు పొడి చాడు. చలిరోడ్డుమీద దీపాలు వణికాయి. వాళ్ళకుక్క 'జాకీ' వచ్చి చెయ్యి నాకింది. ఎదురుగా నుంచుని వుంది ఆ బాలిక దీనంగా. వేలినున్న వుంగరం తీసి జానకి వేలికి తనే పెట్టాడు.

"ఈ రాత్రికి దీనితో సరిపుచ్చు. తెల్లవారకట్టే వెతికి నీ వుంగరం నీకు తెచ్చిపెడతాను" అన్నాడు.

"నిజంగా తెస్తావుకదూ సూరయ్యా"

"ఎక్కడ పోయిందో! ఈ దుమ్ములో కనబడుతుందా? అనే తన సందేహాన్ని దిగమింగుతో.

"ఇక్కడే వుంటుంది, యెక్కడ పోతుంది? రాత్రంతా వెతికన్నా నేను కనుక్కుంటాగా!" అన్నాడు.

జానకి వెళ్ళగానే లాంతరు పట్టుకువొచ్చి వెతికితే అక్కడేకనపడ్డది వెంటనే వెడదామనుకుంటే భోజనమూ, యింటి దగ్గిర పాఠాలు చెప్పే అన్నా, నిద్రా, అటంకపడ్డాయి. తెల్లారకట్టే, లేవాలనే నిశ్చయం ప్రకారం లేచాడు. చలిలో జానకిగారి యింటికి చేతులు ముడుచుకుని పరిగెత్తాడు. వాళ్ళపెద్దమ్మ యింటిముందు ముగ్గు వేస్తోంది.

"జానకి లేచిందా?"

"అర్ధరాత్రి జానకెందుకు కావలసి వొచ్చింది నాయనా!"

"పనుంది"

జానకి పెద్దమ్మకి పిల్లలులేరు. చిన్నతనమూ, అసలు తను చిన్న దానిగా వుండి వుండవచ్చుననే విషయమూ మరిచిపోయింది. ఎవరన్నా ఆమె చిన్నదిగా వుండేదని జ్ఞాపకంచేసినా సృష్టిని పరిశీలించి, చిన్నకాకండా

పెద్దది కావడానికి వీలులేదని ఆలోచించి వొప్పుకోవచ్చు. అప్పటికి కూడా సైజులోను, రూపంలోనే గాని, గుణంలోను, పెద్దమనిషి తనంలోను మార్పువుందని ఒప్పుకోడు.

"పని; పనులు యీ చిన్నవాళ్లకి, జానకి యిప్పుడప్పుడే లేవదు. ఐనా మొగపిల్లవాడికి నీకు జానకి యెందుకు? ఈడా, జోడా, సహవాసమా, బడా, పాఠాలా? నీ పనుంటే మళ్లీ రా! పొద్దెక్కింతరవాత."

ఆ యిల్లు భూగోళం అతనికి బాగాతెలీదు. అందులో జానకిఎక్కడ పడుకుంటుందో! ఆలోచిస్తూ నుంచున్నాడు. చలిగాలి చంపని చరుస్తోంది. తూర్పున వేగుచుక్క ఆశలన్నీ వదులుకోనక్కరలేదంటోంది. తనముందు కాయితంమీద మంచుదేవుడు వేసిన ముగ్గుని పెద్దమ్మ సున్నపు ముగ్గుతో పోలుస్తోనుంచున్నాడు. సాతానివాళ్ల పాట దగ్గిరకొస్తోంది. తెల్లని శాలువ ముసుగుపెట్టుకుని, జాగ్రత్తగా జానకి బైటకి వొచ్చింది.

"యెక్కడికే యీ అర్ధరాత్రి? వెళ్ళు చెపుతా నాన్న లేవనీ" అనే మాటలు వినిపించుకోక సూర్యనారాయణతో రోడ్డుమీదికి వెళ్ళింది. ఆమె వుంగరం ఆమె వేలుకిపెట్టి తనది తీసుకున్నప్పుడు జానకి తనవంక తిప్పిన చూపు యీనాడు మళ్ళీ జ్ఞాపకం వొచ్చింది. అప్పణ్ణించి ఒక యేణ్ణర్ధం జానక్కీ, అతనికీ స్నేహం. ఆడపిల్లలబ్బాయి అని బళ్లో అతన్ని వెక్కిరించేవారు ఆటలికి రాకపోతే. నిష్కారణంగా, అవ్యాజంగా ఒకరోజున జానకిని ముద్దుపెట్టుకోవాలనే కోర్కె ప్రారంభమై, యింక ఆ అమ్మాయిని చూసినకొద్దీ అధికమైపోయింది. యింకెవ్వరు లేకండా వొంటరిగా వుండాలని ప్రయత్నించినా సాగలేదు. ఆ ప్రయత్నమంతా అతని ఒక్కడిదే కావడంచేత, యోచించి ఒక సాయంత్రం ఒక ఆట కల్పించాడు. తాను దొంగ. నిద్రపోయే పిల్లల్ని ఒకొక్కళ్ళనే యెత్తుకుపోయి గుహలో దాచేస్తాడు. గుహ గన్నేరుచెట్టు గుబురు, జానకిని దాస్తే, నిద్రలో కళ్ళు మూసుకుని వున్న జానకిని గుహలో ముద్దుపెట్టుకోపోతే, సగం కళ్ళుతెరిచి చూస్తోందో యేమో, మొహం తిప్పేసింది. ఆ అమ్మాయి పెదిమెలు తన బుగ్గకి రాసుకుని యెంగిలై అతనికసహ్యమేసింది.

ఒకరోజు అతని చెల్లెలు "జానక్కి పెళ్లి" అంది.

"నీకెట్లా తెలుసు?" అన్నాడు అమాంతం చెల్లెల్ని తినేసేటట్టు.

ఈవాళ సాయంత్రం మామగారు పిల్లని చూసుకోడానికి వొస్తున్నారు!"

పక్కనవున్న కుక్కని నిష్కారణంగా వొక్కతన్ను తన్నాడు. సూర్యనారాయణ ఆ కోపంలోనే వెళ్ళి చేతులో కర్రతో బొమ్మజెముడు అట్టలు ఐదారూ, జువ్విమొక్క కొమ్మలు రెండూ విరక్కొట్టి వెళ్ళిపోయి మధ్యాహ్నందాకా తిరిగాడు, ఐడిమానేసి యెక్కడో. మూడింటికి జానకి వాళ్ల యింటికి చేరుకుని చూసేప్పటికి, ఆ అమ్మాయి మూల చాప మీద కూచునివుంది. మొహమలుకోటు, పట్టంచు పావడా, కోటుమీద కాసుల పేరూ, వడ్డాణం, చెవులకి జూకాలతో ముస్తాబై ముందున్న హార్మోనియంలోంచి తనకిరాని పాటని లాగాలని తంటాలుపడుతోంది. ఎదురుగా కుర్చీలమీద పెద్ద తలపాగా, పొడుగాటి కోటూ, వెండి పొన్నుకర్రా పట్టుకుని వొకాయన కళ్లజోడులోంచి ఆ పాటని పరీక్షించి వింటున్నాడు.

పక్కనే శాస్త్రుల్లు జాతకాలు తిరగేస్తున్నాడు. వొక వితంతువు యింకోమూల కూచుని తనవట్లా చూడ్డానికి వొచ్చిన రోజులుగావును జ్ఞాపకం చేసుకుని, యీర్ష్యమొహం పెట్టి చూస్తోంది. జానకితోపాటు యెంత దబ్బిస్తే తీసుకోవచ్చు యీ పిల్లని అని పరీక్షిస్తున్నట్లు కనపడ్డారు వాళ్ళు, సూర్యనారాయణకి. జానకిమీద అపరిమితమైన కోపంతో పరిగెత్తుతో వెళ్ళాడు.

మర్నాడురాత్రి సూర్యనారాయణ వాళ్ళయింట్లో వరండాలో వేళ్లాడుతున్న లాంతరుకింద జానకి కనబడి మామూలు ప్రకారం అతనిచెయ్యి పట్టుకుంది. ఇంకా ముస్తాబు అట్లానేవుంది. కళ్లు కాటికతో అందంగా కనపడుతున్నాయి.

"నీకోసమే చూస్తున్నా"నంది.

అతను చెయ్యి విదుల్చుకుని,

"ఎందుకొచ్చావు మళ్ళీ?" అన్నాడు.

"అదేమిటి అట్లా అంటావు? నేనేం చేశాను?"

"నిన్న సాయంత్రం నేను చూడలా? నీకు పెళ్ళికదూ?"

సిగ్గుతో తల వొంచుకుంది.

"అయితే?" అంది నెమ్మదిగా.

"నా కిష్టంలేదు." అన్నాడు దూకుడుగా.

"మావాళ్ళు చేస్తున్నారు మరి!"

"చెయ్యకూడదు."

"నీ కెందుకు కోపం?"

దానికి ప్రత్యుత్తరం చెప్పగల జ్ఞానశక్తి అతని కప్పుడే పుదయించ లేదు. యేం చెప్పాలో తెలీక వూరుకున్నాడు.

సూర్యనారాయణ తరవాత తొరలోనే కాలేజీలో చదవడానికి యింకో వూరు వెళ్ళాడు. మళ్ళీ శలవల్లో వొచ్చేప్పటికి జానకివాళ్ళకి బదలాయింపై పోయింది.

"జానకికి నువ్వు బాగా జ్ఞాపకమున్నావు. మీ చిన్నప్పటి సంగతు లేమిటో చెప్పింది. ఇంటికి వెళ్ళేటప్పుడు నాతో రా" అంటున్న రామా రావు మాటలు అతన్ని ప్రస్తుత జీవితానికి తిరిగి తెచ్చాయి.

## 2

జానకిని చూడగానే ఆమెలో అందంకన్న అద్భుతమై, ఉన్నతమైన ఆకర్షణ పున్నదని సూర్యనారాయణకి తోచింది. చిన్నప్పటి పోలిక యెక్కువగాలేదు. కొత్తగా ఆమెని పోల్చుకోలేక పోయేవాడే. ఆమె చూపుల్లో, మాటల్లో ఆమె ఆత్మమాధుర్యం పరిమళం వలె అతన్ని ఆవ రించినట్లయింది. కంఠస్వరంలో యింద్రజాలముంది. హృదయాన్ని చెప్పి బయిస్తుంది. ఆమె కప్పుడే ఒక కొడుకు. సూర్యనారాయణనిచూసి జానకి,

"మీరేనా చిన్నప్పటి సూర్యనారాయణగారు! యెంత యెదిగారూ?"

"నన్ను మీరంటారెందుకు?"

"నన్ను మీరో యిప్పుడు?"

యిద్దరూ నవ్వారు.

"నువ్వు ముందటే నే నన్నాను"

"మరి యిపుడు గొప్ప యిన్‌స్పెక్టరుగారు కాదూ నువ్వు?"

"నువ్వుమాత్రం తాసిల్దారుగారి భార్య కాలేదూ?" అంత చనువైన తరవాత ఒకటేమాటలు. ముగ్గురూ మూడు జతలుగా వొకరినొకరు యెరుగుదురు. ఒకజత అనుభవాలు యింకొక జతకి తెలీవు. యే యిద్దరు మాట్లాడుతున్నా మూడోవాళ్ళు చూస్తో కూచోవాలి. సూర్యనారాయణ్ణి చూసి జానకి కళ్ళు నవ్వుతున్నాయి చిన్నప్పటి అల్లరి జ్ఞాపకం వొస్తున్నట్టు.

ఆ యింట్లోకి కాలుపెట్టగానే సూర్యనారాయణకి ప్రణయదేవాలయంలో కాలుపెట్టినట్లు తోచింది. అధిష్టానదేవత జానకి. ఆమె కనుసన్నల్లో మెలుగుతో, ఆమెమాటల్నీ, ఆమె చీర చెరుగునించి రాలే దారాన్ని, తలలోవాడిన పువ్వుల్నీ ఆరాధించే భక్తులు, భర్తా, కొడుకూ. జానకి రామారావుకి తల్లిలాగూ, అతని అమాయకత్వం చూసి జాలిపడి జాగ్రత్త తీసుకోడానికి వొచ్చిన సరస్వతీదేవి లాగుంటుంది. ఆ పిల్లవాడామెని ప్రియుడిలాగు ప్రేమిస్తాడు. ఆమె ప్రేమకోసం, ఆమెకంఠస్వరం వినడం కోసం, చూపులు చిత్రాలు చూడడంకోసం, తన్మయత్వంపొంది, యెట్లా చెపితే అట్లావింటో ఆమె కనుసన్నల్లో మెలుగుతో వుంటాడు. జానకి జీవితం వీళ్ళిద్దరిలోనూ ఐక్యమైపోయింది.

ఇంటికివెళ్ళిసూర్యనారాయణ జానకినే తలుచుకుంటున్నాడు రాత్రల్లా. తలుచుకుంటే ఆమెలో అందం తోచదు. కళ్ళ నిర్మలత్వంలో తెలివీ, పెదిమలదగ్గర దయా, యింక ముక్కుసాఫీలోనూ, వెంట్రుకలూ నుదురూ కలిసచోటా, వేళ్ళచివర్లలోనూ, అన్నిటిలోనూ యేదో ఆకర్షణ వుంది. అంతే. టీ తన కందిచ్చినప్పటి చేతివొంపూ, చిన్న నవ్వు నవ్వితే పెదిమలు పైకి తిరిగినప్పుడు. తీరైన ఎఱ్ఱని పెదిమలు గల వారికి కూడాలేని, వింతగా మనసు కలవరపెట్టే మబ్బుచివర వెలుతురువంటి మెత్తని

కాంతి, అన్నీ అతను యెంత ఆటంకపరచినా లొంగక అతని ధ్యానంలో యిటూ అటూ స్ఫురించాయి.

# 3

పక్కన యిల్లు నిశ్శబ్దంగా వుంది. తోటలో చెట్లు కదలకుండా నిలిచి గాలివేపు చూస్తున్నాయి. అయినా జానకి తల్లో మరువం వాసన వేస్తోంది. జామాబందిరోజులు కావడంచేత రామారావింకా రాలేదు. అబ్బాయి ఆమె వొళ్ళో నిద్రపోయినాడు. ఆమె రెండుచేతులూ అతని కాళ్ళకింద్గా, మెడ కింద్గా వున్నాయి. నెత్తిమీద బృహస్పతి పొడిచాడు. చీకట్లో చంద్రకాంత పువ్వులు తెల్లగా విచ్చాయి. చీకటి పడ్డతరవాత చివరసారి వొచ్చే గులాబి కాంతి, భూమ్యాకాశాన్ని నింపింది. సూర్యనారాయణ చెవిమీద గొల్లభామ కూచుంది. అతను తోసేస్తే జానకి మెడమీద వాలింది. ఆమె అదిరి, నడుము జాచి, అబ్బాయి కిందనించి చెయ్యి లాక్కుంటోంది. సూర్యనారాయణ దాన్ని ఆమెమీదనించి తీసేస్తోవుంటే అతనికి తనవేళ్ళకింద ఆమె మెడ వొణికినట్లు తోచింది. చేతిని అట్లానే వుంచాడు. జానకి తన మెడని పక్కకివొంచి దూరంగా జరిగింది.

"జానకీ"

ఆమెలేచి మాట్లాడకండా యింట్లోకి వెళ్ళిపోయి మళ్ళీరాలేదు. అతనికి యింటివేపు వెళ్ళడానికి ధైర్యంలేదు. అతని అంతఃకరణ నిర్మలమైనదైతే వెళ్ళడానికి సందేహం వుండదు. కాని యిప్పుడు భయమేసింది. తను యింటికి వెళ్ళిపోతే?—

వెళ్ళిపోతే, తప్పు పనిచేసి పరిగెత్తినట్లుంటుంది.........

ఇంటికి వెళ్ళింతరవాత మనసులో యేమిటో అసందర్భపు ఆలోచన్లు తోచాయి. జానక్కి కోపం వచ్చింది. రామారావుతో చెప్పుతుంది. ఇంక తనెట్లా వాళ్ల మొహాలు చూస్తాడు? అంతమాత్రం నిగ్రహశక్తి లేకపోవట మేమిటి తనకి! భార్యా భర్తా తననెంతో ప్రేమతో చూసి, ఆదరిస్తోవుంటే

అట్లాంటి పని చెయ్యడానికి తనకేం పట్టింది? అసలు ఎందుకు అట్లా చేశాడో అతనికే తెలీదు. జానకిని క్షమాపణ కోరుకోవాలని నిశ్చయం చేసుకున్నాడు.

మర్నాడు సూర్యనారాయణ్ణి చూడగానే, జానకి నవ్వుతో లేచి, "అదుగో వచ్చాడమ్మా?" అని అతనివేపు సంతోషంతో వొచ్చింది.

"యీవాళ యీయనకి తలనెప్పిగావుంది, ఆఫీసుకింకా వెళ్లలేదు. యేం తోచక నిన్నే తలుచుకుంటున్నాము" అంది.

ఆ సాయంత్రమంతా అతనితో యెప్పటికన్నా ఎక్కువ సరదాగా మాట్లాడుతూ, అందరినీ ఒకటే నవ్వించింది. కొడుకుతో నవ్వులు, పరుగులు, ఆటలు. సూర్యనారాయణ ఆ వసంతదేవినించి కళ్లు తిప్పుకోలేకపోయినాడు. అట్లాంటి స్త్రీయే వుంటే యింకా స్వర్గంకోసం వేరే వెతకాలా? తన ఆకర్షణప్రభావం, వుత్సాహదీప్తి, అతనికి చూపి వూరించి యేడిపించడానికి ఆ ప్రయత్నమంతా చేసింది అన్నట్లు తోపించింది. అతని దగ్గిరిగా కుర్చీ జరుపుకుని, నెమ్మదిగా రహస్యంవలె ఉత్తమాటే మాట్లాడి, యేం లేనట్లు నవ్వేస్తుంది. మాటలు చెవులని ముద్దుపెట్టుకున్నాయి. కళ్ళనించి కాంతులు చుట్టూ మెరిశాయి. ఆమె మాధుర్యంతో, ఆనందంతో, కలకలమనే కంఠరవంతో సృష్టి నిండిపోతున్నట్లు తోచింది. యింకా మళ్ళీ విచారానికి, లోభత్వానికి స్థలమెక్కడవుందా అనుకున్నాడు. యింతాచేసి తమాషాకి వేషం వేసినట్లు, తనకే సంబంధమూ లేనట్లూ తల వూపేసి నవ్వేస్తుంది. అబ్బాయినవ్వినట్టే. ఆ నవ్వే యెక్కడో హృదయంలో కలిచి యింక యీ శాంతికి దూరమై జీవించి ప్రయోజనమేమనిపించేట్టు చేస్తుంది. యెంత రాత్రైనా సూర్యనారాయణని యింటికి పోనీదు. ఆ కళ్ళు, ఆ పెదిమలు, దగ్గిరికి రమ్మని పిలుస్తున్నాయే అనుకున్నాడు. కుర్చీలోనించి చీకట్లో తనవేపు మెడవొంచి మాట్లాడితే, యిట్లారా అని చేతులు చాచినట్టు తోపించేది. అక్కడే భోజనంచేసి ఇంటికి వెడుతో, జానక్కి తనమీద ప్రేమా, అని ప్రశ్నించుకుని, తన

వెర్రితనానికి నవ్వుకుని సిగ్గుపడి, ఆ పాపపు తలపుకి పెదిమ గట్టిగా కొరుక్కున్నాడు. అతనికి తగిన శాస్తి చేసింది. రామారావుతో చెప్పిందో లేదోగాని, తననించి మొహం తిప్పేసి, కోపం చూపించడంకంటే యింత స్నేహంగా, యింత దగ్గిరిగా, సులభంగా, స్వేచ్ఛగా, నిర్మలంగా వుండ వొచ్చు, దాన్ని మోహ మనుకోడం యెంత నీచమో, మూర్ఖమో విజ్ఞాన విహీనమో చూపి అంతకన్న వెయ్యిరెట్లు శిక్షించింది. జానకిమీద అమిత మైన గౌరవం కలిగింది అతనికి. సూర్యనారాయణ యిదివరకంతా తనది చాలా స్వేచ్ఛగల బతుకని గర్వపడేవాడు. యిప్పుడు తనది చాలా వంటరి బ్రతుకని బాధపడ్డాడు. పెళ్ళి చేసుకుందామంటే, జానకి మాటల మాధుర్యం చెవులలో మోగుతున్నన్నాళ్లు యెవరిమీద తన మనసు పోతుంది? వాళ్ళిద్దరూ యెంత ఆనందంగా వున్నారో! తనుకూడా అట్లా వుండడానికి వీలులేదు. ఒక చిన్న యిల్లూ, తోటా, గదీ, అన్నీ తలచు కుంటే! వాటిల్లో యెక్కడ చూసినా జానకి రూపమే కనబడుతుంది.

## 4

వరండాలో యెవరో పెద్దమనుష్యులతో రామారావు ఆఫీసుపని మాట్లాడుతున్నాడు. వాళ్లందరూ యెప్పుడు వెడతారా అని సూర్యనారాయణ తోటలో కాచుకుని కూర్చున్నాడు. అతని ముందు కామినీచెట్టు. పూసింది. చంద్రు డుదయించబోయేట్టు తూర్పు తెల్ల బడుతోంది. మిణుగురు పురుగులు రెండు, దిక్కులేని వాటిమల్లే, పువ్వుల్ని వదల్లేక చెట్టుకొమ్మల్లోనే తిరుగు తున్నాయి. వెనక క్రోటనులోనించి రెండు చేతులూ అతని బుజాలమీద ఆనుకున్నాయి. వేడివూపిరి అతని చెంపలకి తగిలింది. తలంటి పోసుకుని ఆరని జుట్టు అతని మోహాన్ని కప్పింది. కాలప్రవాహం ఆగింది.

తిరిగి చూసేటప్పటికి యెవరూలేరు. నిజమా! కలా? మనసులో నైనా దిగ్గిరిగా ఆలోచించుకోలేని తన ఆశ నిజమా ?

రామారావూ అతని వెనక జానకీ వొచ్చారు. ఆమె తల ఆరకంగా యింకా సాంబ్రాణివాసన వేస్తోంది. జానకే!! తనమీద ప్రేమచేతనేనా? వేళాకోళమేమో! నిజంగా ప్రేమ వుందా, లేదా? ఆమె నడగాలి. వొంటరిగా ఆమెతో మాట్లాడాలి. ఆమెకూ అట్లానేవుందేమో! ఆ తలపుతో అతని కంఠాన్ని మహాశక్తి ఒకటి గట్టిగా బిగించినట్లయింది....యెవరన్నా రామారావుకోసం రాకూడదూ?

"ఏమిటి ఆలోచిస్తున్నావు? చెప్పు, అట్లాంటి అవస్తలో నువ్వేం చేస్తావు?" అని జానకి అడుగుతోంది. తననే. జవాబు చెప్పాలి. కష్టపడి మెళకువ తెప్పించుకుని, యేమిటో అసందర్భంగా చెప్పాడు. కొంచం సేపుండి రామారావు సిగరెట్ కోసం యింట్లోకి వెళ్లడానికి లేవబోతూ వుంటే, సూర్యనారాయణ గుండెల్లో అపరాని వుద్రేకం కలిగింది. జానకి అతని మొహం చూస్తో 'నేనూవొస్తాను ఆగండి' అని లేచి భర్త బుజంమీద చెయ్యేసి తనూ లోపలికివెళ్ళి మళ్ళీ అతనితో మాట్లాడుతో వొచ్చింది. అంతంలేని కబుర్లెట్లా వొచ్చాయో!

## 5

సూర్యనారాయణ మర్నాడు వెళ్ళేటప్పటికి, జానకి యింట్లోలేదు. పేరంటానికివెళ్ళి ఐదింటికి వచ్చింది. అతన్ని తోటలో చూసి కొంచెం నవ్వి యింట్లోకి వెళ్ళిపోయింది. ఎంతసేపున్నా మళ్ళీ బైటికి రాలేదు. మనసుపట్టలేక అతను లోపలికి వెళ్ళి చూసేప్పటికి నిద్రపోయిన అబ్బాయి వుయ్యాలవూపుతూ ఆలోచనగా నుంచునివుంది. దాకలి పక్క వేస్తున్నాడు. సూర్యనారాయణనీ అతని కళ్ళల్లో నిశ్చయాన్ని చూడగానే తత్తరపడి దాకల్ని వుయ్యాల వూపుతూవుండమని వెనకనే నడిచి వొచ్చింది. ఇద్దరూ అరుగుమీద తోటలో కూర్చున్నారు. జానకి మెళ్లో గంధం అతనికి తల తిప్పింది. గులాబి చీనా పట్టుచీరలోని మెరుపూ పమిట దగ్గిరయెత్తూ అతని వొళ్లు మరిచేటట్టు చేశాయి. ఆమె ప్రేమకోసం యెదురుచూస్తో ఐదు నిమి

షాలు కూచున్నాడు. రాత్రి అనుభవాన్నిపట్టి యేనిమిషాన యేమి చేస్తుందో అని మనసు ఆత్రుతతో వొణికిపోతోంది. ఈదురుగాలిలో మంటవలె ప్రజ్వరిల్లే శక్తుల్ని అణచిపట్టడం కష్టమయింది. ఆమె తనకోసమే కాచుకుని కూర్చున్నదని నిర్ధారణ చేసుకుని, ఆగక సాహసంచేసి చివాలున లేచి, ఆమె తలయెత్తి ముందుకు తన తలవొంచాడు. అందుకే భయపడుతున్నట్టు ఆమె రెండుచేతులతో బలంగా అతన్ని తోసివేసి లేచి నుంచుని వలలోపడ్డ కుందేలు అరిచే రకంగా 'పాపం, తప్పు, వొద్దు' అని దూరంగా నుంచుంది. సూర్యనారాయణకి ఆశ్చర్యం కలిగింది. రాత్రదీ కలనుకున్నాడు.

'నేను పొరపాటుపడ్డట్టున్నాను క్షమించు' అని వెళ్ళిపోతూ ఒకసారి తిరిగి చూశాడు. ఆమె ముఖాన్నిపట్టి తను తిరిగిచూడకపోతే తనని వెనక్కి పిలిచి యేదో మాట్లాడేదేమో అని తోచింది. కొంచెం ఆగాడు. అతను ఆగడంచూసి జానకి యింటివేపు తిరిగి వెళ్ళిపోయింది.

ఇంటికివెళ్ళి సూర్యనారాయణ చాలా బాధపడ్డాడు! మళ్ళీ తాను పొరపడి జానకి నవమానపరిచానని, తన స్నేహితుడి విశ్వాసాన్ని అన్యాయం చేశానని, పశ్చాత్తాపపడి తనను తాను ద్వేషించుకున్నాడు. ఇంక స్త్రీలతో పవిత్రులతో మెలగడానికి తను తగడు. తన మొహం సిగ్గుతో దాచేసుకోవాలి. తను జానకిని, జానకిమీద వెర్రిమోహాన్ని మరిచిపోవాలి. ఇంక వాళ్ళింటికి వెళ్ళకూడదు. కాని జానకి తనకి కావాలని మరిచిపోవడం తన చాతకాదని అంతరంగంలో వినపడుతోనేవుంది. జానకి దగ్గరికి వెడుతోనే వుంది మనసు. ఇంకా ప్రయత్నించి, ఆమెని స్వాధీనం చేసుకోవాలనే కోర్కె కలుగుతోనే వుంది. ఆమెని ఆమె భర్త యింట్లోనే వుంచి యే పది నిమిషాలో చాటుగుండా అనుభవిస్తే సంతుష్టిపడే రకపు మనిషికాదు జానకి. అట్లాంటి జీవనాన్ని సహించదు ఆమె పవిత్రత. ఆమె కళ్ళల్లో నిర్మలమైన దయ. కలకలమని నవ్వుకాంతిని వెదజల్లే ఆమె స్వభావం' పూపరిమళమువలె, నెమ్మదిగా తనదిగా విశ్రాంతిగా అనుభవించాలి. అది అసంభవమని తెలుసు. తనెంత ప్రయత్నించినా ఆ యింట్లోంచి జానకి

కదలదు. కదిలి బతకదు. చెట్టునుంచి పువ్వుని కోసినట్టే. ఇంక జానకిని చూడకూడదు. వాళ్ళయింటికి వెళ్ళకూడదని నిశ్చయించుకున్నాడు. నిశ్చయించుకున్న మర్నాడు సాయంత్రం అయేటప్పటికి సూర్యనారాయణ యింటి దగ్గర కాలునిలపలేదు. ఇట్లాకాదని వూరు విడచి వెళ్ళి వారంరోజులు యెక్కడెక్కడో తిరిగాడు, ఎన్నడో తను మరిచిపోయిన స్నేహితులందరికీ తను యింకా వాళ్ళని మరిచిపోలేదని, యింకెన్నడు మరిచిపోనని జ్ఞాపకంచేసి, కొంతమంది తట్టతగలేసిన బంధువులతో మళ్ళీ సంబంధం కలుపుకుని, తిరిగి వొచ్చాడు.

## 6

"వొచ్చావా? నీ కోసమే చూస్తున్నాము యిన్నాళ్ళనించి" అన్నాడు రామారావు. తన అవివేకపు సంగతి జానకి చెపితే తనని చివాట్లు పెట్టడానికి వొచ్చాడనుకున్నాడు. రామారావు మొహం చాలా జాలిగా, దిగులుగా కనబడుతోంది. ఇద్దరూ టెన్నిసు కోర్టుమూల బల్లమీద కూచున్నారు.

"ఈవేళ అంతా పిచ్చిపట్టినట్టు తిరిగాను. అదేమిటో కావలసినప్పుడే మనుష్యులు మాయమవుతారు ఎక్కడికి వెళ్ళావు?"

తన మేనమామ సవతి తమ్ముడికి యేదో జబ్బుగావుందని గొణిగాడు సూర్యనారాయణ.

"ఎప్పుడొచ్చావు?"

"నిన్ననే"

"ఇంతవరకు యింటికి రానేలేదేం?"

"ఆఫీసు పనితో వూపిరాట్టం లేదు" అని గొణిగాడు.

"సరేలే! నీకూ అసహ్యం పుట్టింది. నాకస్నీ అట్లాగే తటస్థపడుతున్నాయి. సంగతేమిటంటే పది పదిహేనురోజులనించి జానకిలో పెద్ద మార్పొకటి వచ్చింది. డాక్టరుకి చూపిస్తే వొంట్లో జబ్బు లేదంటాడు.

మనసులో విచారం పట్టుకున్నట్టుంది. జానకిని యెంతో అడిగాను. ఏమీ లేదంటుంది."

"అసలు జబ్బు చేసిందని యెందుకనుకున్నావు?"

"మునపటి జానకేకాదు. జానకి నవ్వుచూసి నెలరోజులయింది. నవ్వకపోతే జానక్కి జబ్బుగా వుందన్నమాటే. నాతో సరిగా మాట్లాడదు. అబ్బాయితో ఆడుకోడం మానేసింది. రాత్రులు వులికిపడి లేస్తుంది. అలో చనగా కూచుంటుంది. యేమన్నా నొక్కి అడిగితే చప్పున యేడుస్తుంది."

"తమాషాగానే వుంది. ఎందుకో?"

"అదే తెలీక కొట్టుకుంటున్నాను."

"అయితే యేమంటావు, యిప్పుడు?"

రామారావుకి కోపం వచ్చింది.

"నీకేమీ పట్టనట్టుందే; పోనీలే" అని లేచాడు.

సూర్యనారాయణకి సిగ్గేసింది.

"అదికాదు రామా, కూచో. నాకేం అర్థంగాక నాగోలలో నేనుండి అట్లా అన్నాను. నీకే తెలీకపోతే నాకేం తెలుస్తుంది చెప్పు, అంతేగాని.. పోనీ నన్నేం చెయ్యమంటావో చెప్పు, చేస్తాను."

"నువ్వుమాత్ర మేంచేస్తావులే. కాని నీతోటి చెప్పుకుంటే నాబాధ కొంత తీరుతుందనుకుని యెప్పుడు నువ్వు వస్తావో అని గంపెడాశతో కాచుకుని వున్నాను. ఒక్క వారంరోజుల్లో యిట్లా మారిపోయినావే? నువ్వూ మారిపోయినావు. జానకీ మారిపోయింది. ఇప్పుడాలోచించగా మీరుకాదు, నేను మారిపోయినాను."

"జానక్కి యేదో కొంచెం మనస్సు చెదిరిపోయి వుంటుంది. అదే పోతుంది నాలుగు రోజుల్లో."

"అట్లా తోసెయ్యకు. నాకేదో గొప్ప ఆపద రాబోతోంది. జానకి యెంత మారిపోయిందీ! ఎంత చిక్కిపోయిందీ!"

"అదంతా నీ భయం, అసలే భయస్తుడివి. కొంచెం..."

రామారావుకి కోపం వచ్చింది.

"అట్లా చప్పరించకపోతే యింటికొచ్చి ఒకసారి చూడరాదూ!"

"నేనా!....నేనా!....వస్తాలే....తొందరేం?"

రామారావు మాట్లాడకండా లేచి వెళ్ళిపోయినాడు. సూర్యనారాయణ యేం చేస్తాడు?

మళ్ళీ వెళ్ళి యేమో సమాధానాలు గొణిగాడు, మర్నాడు మూడింటికి వస్తానని వొప్పించాడు.

జానక్కి యిట్లా మనస్థిమితం తప్పడానికి కారణమేమిటి? ఇంకేముంది? తన భర్త స్నేహితుడు తన బాల్యమిత్రుడు తనని ఆ విధంగా అవమానం చేస్తే తను సహించలేక తన భర్తతో చెప్పలేక మళ్ళీ, మళ్ళీ అతను ఆ విధంగా ప్రవర్తిస్తూవుంటే తన స్నేహాన్ని నిర్మలమైన ప్రేమనీ, ఆ విధంగా మలినం చేస్తూవుంటే, యేం చెయ్యడానికీ తోచక, యీసారి కనబడ్డప్పుడు అతనితో ఎట్లా ప్రవర్తించాలో తెలీక, మనోవ్యాధిపడి రామారావుకి కూడా యిట్లా విచారం కలిగిస్తోంది. ఈ క్షోభకంతా తన క్షుద్ర మోహం కారణం. దూరంగా వుందామంటే యీ రామారావు తనని వదిలిపెట్టేట్టు లేడు. వెంటనే బదిలీకి రాసేశాడు. జానకి యింటికి వెళ్ళనే లేదు.

## 7

వారం రోజులు అయిన తర్వాత ఒకరోజు సాయంత్రం రామారావూ జానకీ సూర్యనారాయణ యింటికి వొచ్చారు. జానకి చెంపలు చిక్కిపోయి పలచబడ్డాయి. మనోవ్యాధి పట్టుకున్న వాడివలె రామారావు కనబడుతున్నాడు. 'టీ' తాగి కొంతసేపు కబుర్లు చెప్పుకున్నారు. వెడుతో సూర్యనారాయణవేపు తిరిగి,

"నువ్వు రాకపోతే మేమే వచ్చాం నిన్ను చూడడానికి" అంది. మర్నాడు రామారావు వొక్కడూ వొచ్చాడు.

"సూర్యనారాయణా! నేను గొప్ప ఆపదలో వున్నాను. జానక్కి పిచ్చిపట్టింది. లేకపోతే గ్రహబాధో?"

"గ్రహబాధల్లో నమ్మకం కుదురుతోందా యేమిటి?" అన్నాడు సూర్యనారాయణరావు లేని నవ్వు తెచ్చుకుని.

రామారావు అతని మాటల్ని వినిపించుకోలేదు.

"సర్కీటు వెళ్ళి నాలుగురోజుల కిందట సోమవారంనాటి రాత్రి తిరిగి వచ్చాను. వెంకన్న తలుపు తీశాడు. స్నానంచేసి జానకి గదిలోకి వెళ్ళాను. గదిలో పెద్దగా దీపం వెలుగుతోంది. జానకి కిటికీలో కూచుని చీకట్లోకి చూస్తోంది. పిలిచాను. పలకలేదు. చేయి పట్టుకుని వూయిస్తే కళ్ళు తెరిచి నావంక శూన్యదృష్టితో చూసింది. కొంచెం సేపటికి గానును, పలకరించింది అప్పటికి. యీ లోకానికి సంబంధించిన కంఠం కాదది. నేనేమనుకుంటానో అని కష్టంమీద నాతో మాట్లాడుతున్నట్లు తెలుస్తోంది. ఆ ఇంటిని పెనుభూతం ఆవరించినట్లుంది. తనబాధ నాతో చెప్పమని ప్రార్థించాను. మా యిద్దరి ఆనందం ముక్కలు చెయ్యవద్దన్నాను. నా యేడుపు చూసి తనూ మొదలుపెట్టింది. మధ్యాహ్నం ఆఫీసునించి వొచ్చి గదిలో కాయితాలు చూసుకుంటూ కూచుంటే జానకివచ్చి, నా కుర్చీ వెనక నుంచుని.

"మీ దగ్గిరనించి నేను వెళ్ళిపోతే మీరు సుఖంగా వుండలేరూ?" అంది. అర్థంగాక చూశాను.

"కావలిస్తే మళ్ళీ పెళ్ళి చేసుకోండి"

"యేమిటిది జానకీ?" అన్నాను.

"నేను వెళ్ళిపోవలసి వస్తుందేమో! తప్పదేమో; అట్లా రాసి వుందేమో?" అంది.

నా హృదయంలో పుట్టిన గాఢవిషాదం నా మొహంలో చూసింది మోదే యింట్లోకి వెళ్ళిపోయింది. భయంతో కుర్చీలోనించి లేవలేకపోయి

నాను, పదినిమిషాల సేపు. కాళ్లు వణికాయి. బావిలో పడటానికో, యెట్లాగో ప్రాణహత్య చేసుకోడానికో వెళ్ళిందనుకున్నాను.

వెళ్ళి చూసేప్పటికి యేంచూడాల్సి వస్తుందో! అనే భయంతో అసలే లేవలేకపోయినాను. చివరికి గదిలోకి వెళ్ళి చూస్తే, అబ్బాయిని కావిలించుకుని యేడుస్తోంది. ఇంక దయ్యాలని నమ్మక యేం చెయ్యను? సూర్యా, నీకర్థంకాదు. ఎట్లా చెప్పను? నా ప్రాణాలన్నీ, సంతోషమంతా జానకే. దేవుడు నాకిచ్చిన మహావరం. జీవనానికి వెలుగు, తరవాత నాప్రాణాధికుడు అబ్బాయి. వాళ్ళిద్దర్లో యెవరు కనబడకపోయినా చచ్చిపోతాను. ఈ ఆపద లోంచి నన్నెవరు రక్షిస్తారు? దేహానికి జాడ్యమైతే కుదర్చవచ్చు. దీనిసంగతెట్లా! ఎన్నిసార్లడిగినా, నాతో యీ మూర్ఛానికి కారణం చెప్పదు. నాకేమీ తెలీటంలేదు.. నువ్వో! నువ్వెందుకిట్లా ఐనావు? ఎందుకు మా యింటికి రావు? పూర్వంవలె మేము ఆనందంగా వుండడంలేదనేనా? అంతేనా? ఆపదలో యిట్లా మొహం తప్పిస్తావనుకోలేదు. జానకికి స్వాస్థత కలిగితే మళ్ళీ యిదివరకు వలెనే స్నేహంలో, ఆనందంగా వుందాం. మన ముగ్గురం గడిపిన దివ్యమైన ఆ రోజుల సౌందర్యం జ్ఞాపకం తెచ్చుకో. అదర్శురాలైన భార్యేగాక స్నేహితుడు దొరికాడని యెంత గర్వపడ్డాను! మన ఆనందం చూసి సహించలేక యే దయ్యమో, జానకినావరించి మననీదుఃఖకూపంలో కూలతోసింది..నువ్వు రద్దూ! ఒకవేళ నీతో చెపుతుందేమో!"

రామారావు వ్యధని చూసి సూర్యనారాయణకి చాల జాలి కలిగింది. తనేవెళ్లి యీ విషయం జానకితో మాట్లాడి క్షమించమని ప్రార్థించి ఆమెను సమాధానపరచి రామారావుకి మళ్లీ సౌఖ్యం కలిగించాలనుకున్నాడు. రామారావు బాధని చూసినప్పుడు, సూర్యనారాయణకి జానకి మీద ప్రేమ మాయమైనట్టే తోచింది. స్నేహితుడి అమాయకత్వం, నిర్మలస్నేహమూ చూసేప్పటికి యేమైనాసరే, యెంత త్యాగం చెయ్యవలసి వొచ్చినాసరే, అతనికి మాత్రం యేమాత్రము బాధ కలిగించకూడదని నిశ్చయించుకున్నాడు.

# 8

నిండుచంద్రుడు కనబడకండా పట్టిన మబ్బుని గాలి తరిమేస్తోంది. గాలి కళ్ళు చీకట్లోమూసి, అప్పుడప్పుడు మబ్బులు చినుకుల్ని రాలుస్తు న్నాయి. పక్కన అప్పుడే విచ్చిన జాజీ, నైట్‌క్వీన్ వాసనల బాధనించి మనసు మళ్ళించి పుస్తకం మీద నిలపడానికి వరండాలో దీపం ముందు కూచుని ప్రయత్నిస్తున్న సూర్యనారాయణ మనసు క్రోటను ఆకుల చప్పుడు వల్ల చలించింది. తలెత్తి ఇంకా పుస్తకాన్ని విడవని కళ్ళతో చెట్లలోంచి తనవేపు నడిచివొచ్చే తెల్లని ఆకారాన్నిచూసి ఆశ్చర్యపడ్డాడు. కొంచెం గుర్తు స్ఫురించింది, గుండెలు కొట్టుకున్నాయి. లేచేశక్తి పోయింది. తెల్లని మజిలిన్ చీరె కట్టుకుని, నీలంపువ్వుల వాయిల్ జాకెట్ వేసుకుని, విరబోసు కున్న జుట్టుతో, రాత్రి పన్నెండింటికి చెట్లమధ్యనించి, కొమ్మలు తప్పు కుంటో, లావణ్యరేఖలాగు వొచ్చింది జానకి.

“జానకీ”

పలకక కాలుతో తడుముతో మెట్లెక్కింది. అతను దగ్గిరగా నుంచుని మృదువుగా పిలిచాడు. అతనివేపు మెడన్నా తిప్పక, కళ్ళైనా యెత్తక సరిగా తను ఆ సాయంత్రం కూచున్న గదివేపు వెళ్ళింది. అతను ఆశ్చర్యంతో వెనకనే వెళ్ళాడు, వెన్నెల పడుతున్నా, లోకం చీకటిగా వున్నట్టే తలుపు కోసం చేతులు జాచింది. తలుపు తెరిచి వుండడంచేత ముందుకి తూలింది. అతను చప్పున పట్టుకున్నాడు. ఆమెతల అతని భుజం మీద అనుకున్నది. ఆ సౌఖ్యంలో వొళ్ళుమరుస్తూ ఆమెముఖంమీదికి తలను వంచాడు. కళ్ళు మూసుకుని వుంది.

“జానకీ, జానకీ ఎందుకు వొచ్చావు? నా కోసమే!”

ఆమె పెదవులమీద మెల్లిగా ముద్దు పెట్టుకున్నాడు.

“ఒక్కసారి చూడు. జానకి, నా జానకీ, ఇట్లా చూడు” మాట్లాడ లేదు. కదలలేదు. నిద్రపోతోందా, మూర్ఛపోయిందా? మెల్లిగా తీసుకుని వెళ్ళి పక్కమీద పడుకోపెడితే, కదలకండా అట్లానే పడుకుంది. సూర్య

నారాయణ దీపంయెక్కించి కుర్చీలో కూచుని చూస్తున్నాడు. మూర్ఛ కాదు. నిద్ర. ఆమె చిన్నవూపిరీ, అతనిగుండెల గంభీరధ్వనీ తప్ప యింకేమీ వినపట్టం లేదు. మూలదీపం వెలుగుతోంది. యిక్కడ జానకి నిద్రపోతోంది. ఇది నిజమా? తను ఆ అర్ధరాత్రి, ఆ పక్కమీదే పడుకునికంటున్న కలా? కలేనేమో!

ఎన్నడన్నా జానకియిట్లా తనగదిలో పడుకుంటుందని అనుకున్నాడా? లేపాలా? లేదా? లేపి అడక్కపోతే లేచి యేమంటుందో? నిద్రలోనే నడిచి వొచ్చి వుండాలి. ఏమిటి? ఆమె యిల్లు, వీధులు, తనతోట యిన్నీ యెట్లా నడిచింది? ఏదన్నా మోటారు యెదురైతే, పాము కాలికింద పడితే, తన జానకి యేమయ్యేది! కాని జానకేనా? నమ్మడానికి శక్యంకాకండా వుంది. ఎంత అపాయంలోంచి తప్పించుకుందో! దైవకృప వల్లి తనకి మళ్ళీ దక్కింది. ఎంతఅందంగా పడుకుని వున్నదో! రోజు రోజు యీ సుందర స్వప్నాన్ని తనగదిలో, తన పక్కమీద చూసే రామారావు ఎంత అదృష్ట వంతుడో, ఎన్నిపుణ్యాలు చేశాడో! కాని యీమె యింట్లోవుంటే, అతనికి లోకమెందుకు? ఆపని యెందుకు? క్లబ్బూ, స్నేహితులూ యెందుకు! రాజు పదవైనా యెందుకు? ఏమి అందం? ఆమె పెద్ద నల్లని జుట్టు నొక్కులు నొక్కులుగా, సముద్రపు అలలు కడిగిన నల్లని యిసికవలె పక్కమీద పరుచుకుని వుంది. పక్కకితిరిగి పడుకున్నప్పటి పిరుదుల వొంపు,ఆ మెడ దగ్గిర్నించి, మెల్లిగా బుజాలతో పైకిలేచి, చేతికిందినించి నడుమువరకు తగ్గి మళ్లీ యెత్తుగా, పిరుదులనించి కాలివరకు వొంపుగా తగ్గుతో కనపడ్డం ఆ అందంతో అతనికళ్లు తిరిగిపోయినాయి. మెల్లిగా వూపిరితో లేచిపడే ఆ వక్ష భారం జాకెట్టుకింద కనపడే మెరుపు, అతన్ని అమితంగా బాధపెట్టాయి. రామారావూ, అతని స్నేహమూ, అతని బాధా మనసులోంచి మాయమైనాయి. అతని మనసు పట్లు తప్పిపోతున్నాయి. జానికిని, తన గదిలో పడుకున్న యీ అందాల గనిని, తనిదిగా, జానకి తన జానకిగా చేసుకోవాలి. ఎందుకు వొచ్చింది? తన కోసమే! తనదే! కాని కళ్లు తెరిచి జానకి యేమంటుందో? మళ్ళీ యిదివరకటివలె, కోపంతో,

తృణీకారంతో, బాధతో చూస్తే! భరించలేడు, ఏమైనాకానీ, బాధతో నరాలుతెగనీ, ఆమె నేమీ చెయ్యకూడదు. తాకనేకూడదు. లేపి, ఆమెకి నిద్ర మెళకువ తెప్పించి, యింటిదగ్గిర దిగపెట్టాలి. అంతేనా? తన చేతులోనికి వచ్చిన జానకిని యింతేనా? తన అవివేకంవల్లనే, భీరత్వం వల్లనే జానకి యెప్పుడూ తన చేతుల్లోంచి జారిపోతోంది. తనే గనక సాహసంచేస్తే జానకి వొప్పుకుంటుంది. ఎంత పవిత్రురాలైనా, జానకి.... స్త్రీని గురించి తను ఇంగ్లీషు పుస్తకాలలో చదివిన సంగతులు జ్ఞాపకం వొచ్చాయి. ఛీ, ఛీ, తనని నమ్మి, తను తన బాల్యస్నేహితుడు తన సోదరుడని, తన బాధ యేదో తనతో చెప్పుకోవస్తే తను అక్రమమైన ఆలోచనని చేరనియ్యవొచ్చా! ఇంక ఆలస్యం చేస్తే వున్నమతే పోతుంది.

"జానకీ, జానకీ! లే"

లేవలేదు. బుజంపట్టి వూయించాడు. ఆ స్పర్శతో, నున్నని, బుజం చేతికి తగలడంతో అతని ఆలోచనలన్నీ నిశ్చయాలన్నీ యెటువి అటు చెదిరిపోయినాయి.

"జానకీ, నా జానకీ!"

మొహం దగ్గిరికి వొంగాడు. గడ్డంకింద చెయ్యేసి, ఆమె మొహాన్ని తనవేపు తిప్పుకుని చూశాడు. మొహంమీద జుట్టు పడుతో, చిన్న చక్కని ముక్కులోంచి వూపిరి పల్చని పెదిమల్ని కదిలిస్తున్నట్లు, ఎంతో ముద్దుగా, పడుకునివున్న జావకి, తన జానకి, తన నేమీ అనదు. ఆ కళ్ళలోకి కోపమేరాదు. ఎన్నిసార్లో ఏ కల కన్నాడో ఆ కల కోర్కెని తీర్చుకున్నాడు. మెడకింద జుట్టులోనించి, చెయ్యేసి, తలని పైకెత్తి గట్టిగా తన రొమ్ముకి అద్దుకున్నాడు. అంతే అతను కోరింది. అంతే అంతే. జానకిని తన సోదరిని, సురక్షితంగా రామారావుకి వొప్ప చెప్పాలి.

"జానకీ, జానకీ, లే"

ఆమె తల పరుపుమీద వుంచి, ఆమెకేసి చూశాడు. ఈ నిద్రపోయే అందం యెప్పుడూ చూడలేదు. తన జన్మకంతా నింపుకోవాలి జానకితో ఆ నాలుగు నిమిషాల్లో. ఆమె వూపిరి అతని చెంపని తాకుతోంది. ఆమె చీర చెరుగు అతని చేతిమీద పడ్డది. ఆమె గుండ్రని మెడ, పక్షం, నూదంటురాయివలె అతని చేతిని లాగుతున్నాయి. ఆమె పెదిమలు అతని దగ్గిరిగా వొస్తున్నట్టే కనపడ్డాయి. మెల్లిగా ఆమె పెదిమలమీద తన పెదిమల్ని ఆనించి, ఆమె వూపిరి మాధుర్యం అనుభవిస్తో అగాడు. ఇదేమిటి? ఛీ, వొద్దు. కూడదు. జానకినిలేపి, యింటికి తీసుకువెళ్ళాలి. అనుకుంటాడు. కాని కదలలేదు.

మెల్లిగా జానకి కదిలింది అతని ముద్దుతో. నూరేళ్ళ నిద్ర మంత్రం నించి మేలుకున్న రాచకన్యవలె. జానకి దీర్ఘ నిశ్వాసం తడిచి, కళ్ళు తెరవకుండానే చేతులుజాచి, అతని మెడవెనక వేళ్లు కలిపి, అదిమిపట్టుకుని బలంగా దగ్గిరికి లాక్కుంది అతన్ని! సూర్యనారాయణ ఆనందంతో మైమరిచాడు. కాని రామారావనుకుంటోంది. అన్యాయం, అన్యాయం జానకిని లేపాలి. కాని ఆనందం, అహా, ఆ వేళ్ళబలం, ఆవేశం, అతన్ని కదలనీలేదు. ఇదేమిటి ఇంత బలంగా, యింత స్వతంత్రంగా, యింత మోహంతో....తెలిసిన తరవాత యీమోసాన్ని జానకి భరిస్తుందా?

తన మొహం మళ్ళీ చూస్తుందా?

"జానకీ, జానకీ!"

గట్టిగా వుయించాడు. కళ్ళుతెరిచి అతనిమీద దృష్టిని ఒక్కనిమషం నిలిపింది. సంతుష్టితో మూర్ఛపోతున్న ఆమె కళ్ళలోకి భయంకరమైన చూపు వొచ్చింది. వేళ్ళాడబడే మృగపు మరణవేదన చూపు కలిగింది. దేహం అతన్నించి దూరంగా ముడుచుకుని సన్నగా బాధతో అరిచింది.

"యెట్లా వొచ్చానిక్కడికి: యెందుకు తీసుకొచ్చావు? యేంచేశావు?"

"నువ్వే వొచ్చావు"

"నేనా! ఛీ, ఛీ, అబద్ధం!"

"నిజం. నువ్వే వొచ్చావు"

"నేను రాలేదు. నేనెందుకొస్తాను? నేను రాను. యెన్నటికీ రాను. నన్ను కోసినా రాను. నా నరాలు కాలిపోతున్నా రాను!"

మెత్తని నవ్వుతో, కన్నీళ్ళ చిరునవ్వుతో, చూసే ఆమె కళ్ళల్లో గుడ్లు మధ్యకివచ్చి కిందికి దూకేట్లు మిడిసిపడుతో కనపడ్డాయి. హృదయం కరిగిపోయింది. అతను ఆమె చెయ్యి పట్టుకుని,

"జానకీ నిజం చెపుతున్నా. నువ్వే నిద్దట్లో పెళ్ళతెలీక యిట్లా నడిచి వొచ్చావు. నావల్ల నీకేమీ భయంలేదు. యిట్లా చూడు. నాలో నమ్మకముంచి నీ బాధంతా నాతో చెప్పు. చెప్పితీరాలి. నీ కోసం, నీ సంతోషం కోసం, నీకు శాంతి కలిగించేందుకు నా ప్రాణమైనా యిస్తాను" అన్నాడు.

ఆమె వేదన అంతా కరిగి కన్నీళ్లుగా కారింది. రెండు చేతులూ అతని బుజాలమీద వేసి తలని అతని దగ్గిరిగా ఆనించి యేడ్చింది. వాన కురిస్తే భూమి చల్లబడి ఆకాశం తేలికైనట్లయింది. ఆమె చూపు.

"యిందుకూ నా బాధంతా యిందుకూ. సూర్యా, నీతో యిట్లా వుండ టానికి వీల్లేదు గనుక. ఆశపెట్టి నిన్నేడిపించిన కఠినాత్మురాల్ని. నీ కళ్ళు ప్రతి సాయంత్రం నన్ను తిట్టడం చూసి వోర్చుకున్నాను. నిన్ను చూడ కండా వుండలేక నా శక్తికి నా వాంఛ అధికమై యెంత అణిచినా ఆగక, నిన్నట్లా తాకి పాపమని ద్రోహమని నీయెడల అన్యాయమని బాధపడేదాన్ని.

"నీముందు వొప్పుకోడానికి వీల్లేదు. వొప్పుకున్నానా గోతులో పడ్డా నన్నమాటే. నేనుపడ్డ బాధ యెవరి కర్థమవుతుంది? రాత్రింబగళ్ళు వొక్క నిమిషం విశ్రాంతి లేకుండా ప్రతిరోజూ యెక్కువై యే తీరమూ కనపడని బాధ!

"ఆ రామారావుగారినీ, అబ్బాయినీ, నా సిగ్గునీ, మర్యాదనీ, అన్నిటినీ పారేసి, నీతో వుండటమెట్లా! ఆయన జీవితమే నా మెళ్ళో వేశారు. యెట్లా తెంపను? మళ్ళీ నాకెందుకు కనపడ్డావు నువ్వు? నేనోర్చుకో లేనింక.... యెన్నాళ్ళని ప్రాణాలు బిగబట్టి!...."

"యెందుకట్లా శ్రమపడ్డావు జానకీ? నా అభిప్రాయం తెలీకా?"

"కాదు. మొదటినించీ తెలుసు. అందుకనే యీ వేదనాధిక్యత. కాని నీతో అట్టాటి సంబంధం పెట్టుకోడం నా కసాధ్యమైనపని. ఆయన విశ్వాసమే నన్ను కట్టేసింది. నిన్ను రహస్యంగా కలుసుకుని ఆయన యింట్లో ఆయన పక్కమీద.... మళ్ళీ ఆయన రాగానే నవ్వి ప్రేమ చూసి ఛీ, ఛీ.... కాని నీనించి నా మనసుని వొక్క నిమిషం మళ్ళించలేకపోయి నాను. యేం జరగనియ్యకూడదని నిశ్చయించుకున్నానో అవన్నీ జరిగినట్లే ఆలోచించుకుని స్వల్ప సౌఖ్యాన్ని పొందేదాన్ని. చచ్చి యీ పీడనంతా తప్పించుకుందామని ఆ పాడుబతుకు చాలించాలని, దేంట్లోనో పడాలని, యెంతో ప్రయత్నం చేశాను. కాని, అబ్బాయిని, ఆయన్ని, వాళ్ళ నిస్సహాయత్వం, దుఃఖం తలుచుకుని కష్టంమీద ఆ యత్నం మాని, చెప్పలేని, వోర్చుకోలేని బాధని అణుచుకుని చచ్చేదాన్ని తెల్లారిందాకా."

"జానకీ! నాతో చెప్పకండా దాచుకుని పాపం యిన్నాళ్లు యిట్లా పిచ్చిపుట్టేంత వ్యథపడ్డావా? నా చిన్న జానా! నాతో చెపితే నేను కామా తురుణ్ణయి, పశువునై, నీ కిష్టంలేందే స్వాధీనం చేసుకుంటా ననుకున్నావా? అయ్యో! వృథాగా యెంత నలిగిపోయినావమ్మా.... యిప్పుడు చెప్పు. యీ సమస్య లెట్లా విడతియ్యాలో! రామారావు, అబ్బాయి, నేను, పాతివ్రత్యం, అన్నీ కావాలి నీకు, యెట్లా! పోనీ రామారావుతో యీ విషయం మాట్లాడితే........"

"యేమని?"

"మన సంబంధాన్ని అతను ఉదారంగా వొప్పుకోవాలని."

"యెట్లా వొప్పుకుంటారు? మనమెట్లా మాట్లాడుతాము? అంత సాత్వీరుడై సందుపల్ల సహిస్తాడనా, నీ వుద్దేశం? మళ్ళీ నీ భార్యనై నా కాను గదా ఆయనతో సంబంధం నువ్వోర్చుకోగలవా? అందులో భర్త?"

ఆమె మాటలు నిజమేనని సూర్యనారాయణకి కూడా తెలుసు.

"మరి యింకెట్లా జానకీ! నేను నీకు కనపడకండా వెళ్ళిపోతాలే."

జానకి భయం నిండిన కళ్ళతో చూసింది.

"వొద్దు. యేమన్నా కానీ, నువ్వు మాత్రం వెళ్ళిపోవొద్దు. యెంత కష్టపడ్డా వొక్కసారి నిన్ను చూస్తే కొంచెం విశ్రాంతి కలుగుతుంది. నువ్వు కనబడకపోతే యింక నిరాశతో విశ్రాంతి నివ్వని వేదనతో మాడిపోతాను. ఏమన్నాకాని నువ్వు మాత్రం వెళ్ళిపోకు."

"అయితే యెట్లా? నువ్వు వాళ్ళని వొదిలి నా దగ్గిరికి వొచ్చెయ్యి. రామారావు నలిగిపోతాడంతే. పోవాలి. యేం చేస్తాం? నాకూ వుంది అతని మీద నీకున్నంత ప్రేమ.

యిట్లా బాధ యెన్నాళ్లు పడగలవు? యిట్లా చిక్కి బాధపడి పిచ్చెత్తి యెన్నాళ్లు బతుకుతావు! నువ్వు చచ్చిపోతే యేమవుతాడు? అంతే అనుకో. అట్లా ఆ యింట్లోవుంటే యెట్లానూ బతకవు. యెవరికీ కాకుండా పోతావు."

మర్నాడు రాత్రి రామారావు నిద్రపోగానే అబ్బాయిని తీసుకుని తన బంగళావెనక బయలులో సూర్యనారాయణని కలుసుకుని అతనితో వచ్చేస్తానంది. సూర్యనారాయణ చినుకుల్లో జానకిని తీసుకుని బయలుదేరి రామారావు యింటిగేటు దగ్గిర దిగబెట్టి వొచ్చాడు.

## 9

రాత్రి పదిగంటలైంది. అబ్బాయి తొట్టెలో నిద్రపోతున్నాడు. బల్ల మీద టేబిల్‌లైట్ వెలుగుతోంది. వాన గాలి లోపలికి రాకుండా కిటికీల అద్దం తలుపులు మూసివున్నాయి. దీపం అద్దంలోపల మెరుస్తోంది. జానకి మంచంమీద కూచుని వుండి. రామారావు ఆమె వొళ్లో చేతులూ తలా పెట్టుకుని కింద కూచున్నాడు. పొద్దుననించి జానకి చర్య విపరీతంగా కనపడి అతనికి విచారం కలిగిస్తోంది. తను చచ్చిపోతే అతనేమౌతాడని అడిగింది. మరిచిపోలేడా? అందరూ మరిచిపోవడంలేదా! మళ్ళీ పెళ్ళి చేసుకోరాదా! ఇట్టా ప్రశ్నలు వెఱ్ఱిచూపులు, యిటూ అటూ తిరగడం. 'ఇదే ఆఖరుసారి'

అనడం. యెంత బలిమాలినా కారణం చెప్పకపోవడం, అతని కివి భారమే కాకండా, కోపంకూడా కలిగించాయి; యెన్నాళ్ళీగోల అనిపించింది. జానకి మెల్లిగా అతని జుట్టు దువ్వుతో "వెళ్ళి పడుకోండి" అంది.

రామారావు లేవలేదు. పది దాటింది. ఇంకా పడుకోడేం? యితన్ని వొదిలి వెళ్ళిపోవడమేనా? అతని వీపునీ మెడనీ వేళ్ళతో రాస్తోంది. అతన్ని చూసినకొద్దీ దిగులెక్కువవుతోంది. మొహం తిప్పేసి సూర్యనారాయణ సంగతి ఆలోచించింది.

రామారావు నిద్రపోయినట్లు తోచగానే మంచంమీదినించి లేచి అతని కేసి చూస్తో వొక్క నిమిషం నుంచుంది. రేపీపాటికి ఎట్లా వుంటాడు? ఏంచేస్తో వుంటాడు? మెల్లిగా హాల్లోకివెళ్ళి చెవుల కమ్మలూ, చేతుల బంగారు గాజులూ, మెళ్ళో గొలుసూ, తీసి బల్లమీద పెట్టింది. రామారావు పేరున్న వుంగరం, తన పుట్టిన రోజున అతను బహుమతి యిచ్చిన "బ్రోచ్" తీసింది. అతను ఆ రోజు తనతో అన్నమాటలు, తనకి చేసిన వాగ్దత్తాలు, తన పైన చూపిన మోహం, జ్ఞాపకంవొచ్చి కుర్చీలో కూలబడి చేతులూ, తలా బల్లమీద ఆనించి మెల్లిగా యేడ్చింది.... పురుము.... సూర్యనారాయణ తన కోసం వానలో నుంచుని వున్నాడు. తన కోసం యెదురుచూస్తో. చప్పునలేచి అబ్బాయి వుయ్యాల దగ్గిరికి వెళ్ళింది. ఎత్తు కుంటే లేవడూ? బైటికి చీకట్లో వానలో తీసుకువెళ్ళగానే అతను లేచి-

"అమ్మా! యెక్కడికి?" అంటే!... అన్నట్లు ప్లానల్ వొక్కటియ్యాలి. శాలువ వొక్కటి కావాలి. ఉయ్యాల దగ్గిరికి మళ్ళీవెళ్ళి అబ్బాయి వొంక చూస్తో నుంచుంది. వెచ్చగా, హాయిగా, అమాయకంగా నిద్రపోతు న్నాడు. తనని నమ్మి తన మంచికోసమే అనుకుని తనవెంట వొస్తాడుకదా, న్యాయమా, అని అడుగడు కదా? 'నాన్న యేడే?' అంటాడేమో! అంటే, ఈ యింట్లోంచి, యీ రక్షణ కిందనించి యెక్కడికి తీసుకువెడుతోంది తను? వెలి, వెక్కిరింపులు, బాధలు, తనేకాక యావజ్జీవితమూ తన బాబు కూడా అనుభవించాలా! వొదిలి పెడితే యితన్ని! పాపం! తననీ పాపనీ

చూడక రామారావు యేమౌతాడో! తండ్రికి అబ్బాయిమీద వున్న గొప్ప ప్రేమ మనసుకి వొచ్చింది. పాపం రామారావు రేపు మూలమూలల చూసి, అబ్బాయి బట్టలూ, గిలకలూ, బండీ చూసి యేడుస్తాడు. రామారావునికూడా తీసుకువెళ్ళకూడదూ ?

అబ్బాయిని వొదిలితే! అమ్మో! తను బతకగలదా? పోనీ, అబ్బాయి నిలవగలడా? ఆయన విచారంలో కొట్టుకుంటో అబ్బాయిని చూస్తాడా? తన మీది కోపం యితనిమీద చూపడా? ఆ సమస్యలతో తల తిరిగిపోయింది. ఆలోచనలు ఆగిపోయినాయి. ఉరుము — పాపం సూర్యనారాయణ యెంత సేపయిందో వొచ్చి! నిరాశతో వెళ్ళిపోతాడేమో!

చప్పున అబ్బాయినెత్తుకుంది. చంద్రమతి లోహితాస్యుడి శవాన్నెత్తి కెడుతో యేడ్చిన పద్యం జ్ఞాపకం వొచ్చి చేతులు వొణికి అతన్ని సగం యెత్తినదల్లా వొదిలింది. అబ్బాయి 'అమ్మ'అన్నాడు. రామారావు తలెత్తి 'జానకీ' అని పిలిచాడు. తన వొంటిమీద నగలు లేకపోవడం చూస్తాడేమో! మాట్లాడలేదు. మళ్ళీ పిలిచాడు.

"అబ్బాయి లేచాడు" అని వుయ్యాల వూపుతో నీడలో నుంచుంది కొంచెంసేపుండి "నేను రానా?" అన్నాడు. ఇదేమిటీవేళ యింత పట్టుదలగా వున్నాడు? దీపం బాగా తగ్గించి పక్క దగ్గిరికి వెళ్ళింది. ఇప్పుడు మళ్ళీ యెందుకు లేచాడు? మళ్ళీ మాట్లాడుతో కూచుంటాడేమో! కొంచెం ముందే బయలుదేరి వుంటే; యీపాటికి సూర్యనారాయణ కౌగిలిలో, అతని మొహంకేసి చూస్తో... ఆనందంతో వొళ్ళు పులకరించింది. నిన్న అతను గట్టిగా అదుముకున్నప్పటి స్పర్శసుఖం జ్ఞాపకం వొచ్చింది.

రామారావు ఆమె చెయ్యి పట్టుకుని మంచము మీదకు లాక్కున్నాడు.

"పడుకోండి వొస్తాను"

రాత్రి జానకి యిట్లా లేచి తిరుగుతోవుండడం, విచారంలోనూ, పరధ్యానంలోనూ వుండి తననించి తప్పించుకుంటున్నట్లుతోచింది రామారావుకి. జానకి యెందుకు తప్పించుకుంటుంది? ఎన్నాళ్ళయింది ఆమెని తను తాకి?

రామారావు స్పర్శలోనే అతని భావాన్ని జానకి గ్రహించి భయ పడ్డది. సూర్యనారాయణతో హృదయం నిండివుండగా రామారావుకి లోబ డాలనిపించలేదు.కాని అతని ఆఖరు కోర్కెనెట్లా నిరాకరించడం?తన మెడ నించి అతని చేతులట్లా వేళ్ళాడుతో వుంటే అతన్ని తోసెయ్యగలదా? అతని స్పర్శ యెంత మధురంగావుందో! చంటిపిల్లవాడు ప్రార్థిస్తూవున్నట్లు. కాని యెట్లా వొప్పుకోడం!

"నా దేహం మనసూ బాగుండలేదు. పడుకోండి"

రామారావు వినిపించుకోలేదు. ఆ మాటన్నది గాని, ఆతృతతో అతనివేపు జరుగుతున్న తనదేహమే చెపుతోంది రామారావు కావాలని....

పదకొండున్నర కొట్టింది. రామారావు జానకి బుజంమీద తలపెట్టు కుని నిద్రపోతున్నాడు. ఆమె కళ్లుతెరుచుకుని పైకిచూస్తో గంటవిని వులికి పడ్డది. సూర్యనారాయణ యేమనుకుంటున్నాడో పాపం! ఒక్కడూ! ఆ చీకట్లో! ఆ తలని తన చేతులతో తీసెయ్యలేదు. రామారావు తనకి కావాలి.

చిన్నతనంనించి ఆమె జీవాన్ని నడుపుతున్న వూహల్లోనించి తప్పిం చుకొని తనకి యిద్దరిమీదా ప్రేమే అని తెలుసుకుని వొప్పుకోగల జ్ఞానం, ధైర్యం జానక్కి యింకా రాలేదు. భర్త వొక్కడే స్త్రీకి. అతనే దైవ మనే "సెటిమెంటు" ఆమె కళ్ళని కప్పింది.

ఆ పాపమైనా చెయ్యగలదు గాని, వాళ్ళిద్దరూ వొప్పుకున్నా యిద్దరి తోనూ జీవితం గడపడం ఆమెకి అసాధ్యం. కనక యిద్దరిమీద ప్రేమఅనే సంగతి ఆమెకు స్ఫురించడం అసంభవమయింది. యే పనులు చెయ్యడానికి ధైర్యంలేదో అవి మంచిపనికాని, లోకంలో సహజములని కాని వొప్పు కోడం కష్టం.

## 10

రోజల్లా చినుకులు పడుతో యెదురు గాలి వీస్తోంది. ఇల్లంతా నాలుగుగంటలకే చీకటి. లోకమంతా విచారమయంగా,జీవితంఅర్థహీనంగా,

ఆదర్శాలు, ఆశలు అబద్ధాలుగా తోచాయి. రాత్రి యెనిమిదింటికి జోరని వాన మొదలు. సూర్యనారాయణ ప్రతినిమిషం బయటికి వెళ్ళి ఆకాశం యే మూలన్నా తెరిపి యిచ్చినట్లు నక్షత్రం కనపడుతోందేమోనని చూశాడు. గుండెల శబ్దం తొందరవల్ల ఒక్కనిమిషం కూచుని నరాల తొందరవల్ల పదిన్నరకే బైలుదేరాడు. ఆ వానలో చీకట్లో జానకి రాదేమో! కానివొస్తే! వొచ్చినా, రాకపోయినా తను యింట్లో నిలువగలడా! రోడ్డుమీదికి వెళ్ళేప్పటికి మీద వానపడి గొడుగు జ్ఞాపకం వొచ్చింది. ఇంట్లోకివొచ్చి దీపం వెలిగించాడు. జానకి వొచ్చేప్పటికి యిల్లు అల్లరిగా యిట్లానే వుంటే! అన్నీ సర్దాడు. మంచంమీద పక్కవేశాడు. వానలో వెళ్ళి తెచ్చిన చామంతి పూలదండని యెదురుగా తగిలించాడు. జానకి వొచ్చేప్పటికి సిద్ధంగా వుండాలని కాచివుంచిన నీళ్లు వేడిగా వున్నాయో లేవో వేళ్ళుపెట్టి చూశాడు. గొడుగు దగ్గరికి వెళ్ళేప్పటికి యింకో ఆలోచన తోచింది. జానకి గొడుగేసుకుని వొస్తుందా? అబ్బాయిని చంకనెత్తుకొని వొంటరిగా చీకట్లో నడిచివొస్తుంది. అబ్బాయి నెత్తిమీద చెరుగు కప్పి…తనకి గొడుగా! జానకి రాగానే కావలించుకోడానికి తనరెండు చేతులా ఖాళీగా వుండవొద్దూ!

తడుస్తూ చీకట్లో, నీళ్ళగుంటల్లో, బురదలో వెళ్ళాడు, బంగళా వెనకాల తుమ్మలమైదానం మీదికి. గాలిలో చెట్లు దయ్యాలమల్లే వూగుతున్నాయి. ఆకాశపు మెరుపుదెబ్బలు భరించలేక భూమి బాధతో, భయంతో మూలుగుతోంది. సూర్యనారాయణ జుట్టులోంచి, కనుబొమ్మల్లోంచి, జేబుల్లోంచి నీళ్ళు కారుతున్నాయి. చలిలో వొణుకుపుడుతోంది. జోరుమని కొట్టే వాన, వురిమే మబ్బులు, కారుచీకటిని కల్పిస్తూ గంతులేసే చెట్లు, తడి, చీదర, కాళ్ళమీద పైకిపాకే గండుచీమలు, వీటిని అరగంట అనుభవించేప్పటికి సూర్యనారాయణకి మోహం తగ్గింది. దేవుడే తనకి విఘ్నం కలిగించడానికై యిట్లా భయంకర రూపం దాల్చినట్లయింది. పాపం! ఆ చలిలో, గాఢాంధకారంలో, అబ్బాయిని మోసుకుంటూ జానకెట్లా వొస్తుంది? రామారావుని పక్కమీద ఆ యింటికంతా పంటరిగా వొదిలి! తనమీద రామారావు విశ్వాసం, ప్రేమా జ్ఞాపకం వొచ్చాయి. యెందుకు తనిట్లా రామా

రావు సంసారం పాడుచెయ్యటం! అతనా దిగులుతో నిజంగానే చచ్చిపోతే? పిచ్చెక్కితే! మర్నాడు తన యింటికి వచ్చి అల్లరి చేస్తే! యెవతెనో లేవ తీసుకువచ్చినవాడని బంధువులూ, స్నేహితులూ అందరూ మొహాలు తిప్పెయ్యడం, జానకి దిగులుపెట్టుకోడం, రామారావు కోసం నిద్దట్లో లేచి వెతకడం అన్నీ తలపుకొచ్చాయి. యెన్నాళ్ళీ బతుకు. యీ యింద్రియసుఖాలు అని ఆలోచిస్తో చీపురుపుల్లలాగు ఆ ప్రచండ వాతపాతంలో బాధపడుతో నుంచున్నాడు యెన్ని గంటలో.

# 11

"అక్కడ ముల్లు గుచ్చుకుని నెత్తురు కారుతోంది. తాకకు, నువ్వు వెళ్ళిపోతావేమో ననుకున్నాను. అయినా ఒకవేళ యీ వానలో నువ్విట్లానే నుంచుని వుంటావేమోననే దిగులుతో ధైర్యంచేసి వొచ్చాను. నువ్విక్కడే కనబడకపోతే మళ్ళీ యింటికెట్లా వెళ్ళగలిగేదాన్ని! నా అక్రమాన్ని చూసి దయ్యాలు నన్ను చీల్చుకుతినటానికి వొచ్చినట్టే భయమేసింది. ఆ చెట్లు వూగుతో వుంటే."

మెరుపు మెరిసింది. ఆమె తలలో దవనం, వీడిన జుట్టునించి, తడిలో అతుక్కుని వేళ్ళాడుతోంది. గుబురుగా చంపలపైన వుఖికే జుట్టు చీదరగా చంపలకి అతుక్కుని చెవుల చివరనించి నీళ్ళు కారుతోంది. చీరా రెవికా తడిసి వొంటి కతుక్కున్నాయి. షర్టుగుండీలు ఆమెకి గుచ్చుకోకండా తీసి కిందపారవేసి, మెల్లిగా ఆమెని కావలించుకున్నాడు చలిలో. యిదివరకటి సౌఖ్యం అతనికి కలగలేదు.

"అబ్బాయి యేడీ? తీసుకురావా?"

జానకి మాట్లాడలేదు. జవాబుకి ప్రయత్నించి సిద్ధమౌతున్నట్టుంది.

"యేం జానకీ?"

"నూర్యా, నేనురాను, రాలేను. రాలేను."

అది కంఠస్వరంకాదు. ఘోరపాపాలుచేసి, చచ్చి, అన్ని ఆశలూ నశించినా యీ లోకాన్ని వదలలేక ఆ తుమ్మచెట్లలో వూగే దయ్యమేదో అరుస్తోందనిపించింది.

"యెందుకు, జానకీ మళ్ళీ యిట్లా అంటావు?"

"ఆయన్ని వదలలేను....నాకే యిష్టంలేదు."

"మరి నేనూ? యీవేళ యెందు కిష్టంలేకుండా పోయింది? నన్ను వదిలేస్తావా?"

"నిన్ను వొదిలెయ్యలేను. కాని నేను రాను"

"తమాషా చేస్తున్నావు. రావూ? యెందుకూ?"

ఆమె రానంటే, అతనికి పట్టుదల యెక్కువౌతోంది.

"రమ్మనకు, నువ్వు గట్టిగా రమ్మంటే, వెళ్ళేశక్తి పోతుంది నాకు. నీకు నామీద యిష్టంలేదు పొమ్మను. అబద్ధమే. కాని నమ్మి వెళ్ళిపోతాను"

"యేమిటి, జానకీ? యెందుకట్లా మాట్లాడతావు?"

"నేను నీతోవున్నా, ఏమీ సౌఖ్యమివ్వను, నేను పిశాచిని. యెవరికీ సౌఖ్యమివ్వను. నన్ను పొమ్మను. 'నాకు నీమీద మోహమేమిటి?' పొమ్మను."

"విచారంతో నీకు మతి చలించింది. యిట్లా కూచో"

"సూర్యా! నీ కాళ్ళమీద పడతా. నన్ను వొదిలెయ్యి. అట్లా లాగావంటే నీతో వొచ్చేస్తా. నిన్నింక వొదలను. నీ జీవితాన్ని ధ్వంసంచేస్తా. నీ మనస్సుని క్షోభపెడతా. నీ ప్రేమని చీల్చుకుతింటా. ఇప్పుడు ఆయనకెంత మనోవ్యథ కలిగించానో అంతకి పదిరెట్లు నీకు కల్పిస్తా. ఈ జన్మానికి నా ఆనందం ఆఖరయింది. నన్ను తీసుకోకు, వొదిలేసి వెళ్ళిపో. నా మాట వినవూ? నీ కోసమే చెబుతున్నా నమ్ము. అదుగో అట్లా తాకావా, అట్లా విచారపడ్డావా, వొచ్చేస్తా! నాకెంత వెర్రిమోహమో నీకు తెలీదు... పోనీ. నామీద దయలేదూ! జాలిలేదూ? నీ చేతుల్లోనే నీ మూలానే, పిచ్చిపట్టి, చచ్చిపోతే నీ కెట్లా వుంటుంది? సూర్యా, యింతే, యింక యింతే, కరుణించు, క్షమించు."

కిందికిజారి అతని మోకాళ్ళని కావిలించుకుంది. పొడుగాటి ఆమె జుట్టు, నిన్న ఆవేళకే తన తెల్లని పక్కమీద పరుచుకున్న జుట్టు మట్టి నీళ్ళలోపడి కొట్టుకుపోతోంది.

"ముందు, ఇంటికి వొచ్చెయ్యి. స్థిమితంగా రేపు ఆలోచిద్దాం."

"వొస్తే ఇంక నిన్ను వొదలగలనా? రేపూలేదూ ఏమీలేదూ. నేను రాను."

మెల్లిగా ఆమెని బుజాలు పట్టుకుని లేపతీసి, రోడ్డువేపున నడిపించాడు.

"ఎక్కడికి?"

"రా"

మాట్లాడకండా వొచ్చింది వాళ్ళ బంగళా గేటుదగ్గిర నుంచోపెట్టాడు.

"జానకీ, నువ్వు అన్నమాట నిజం. రామారావూ, అబ్బాయిలేకండా బతకలేవు. వెళ్ళు. నన్ను మరిచిపోడానికి ప్రయత్నించు."

"నువ్వో!"

"ఏదో వొకటి చేస్తాను. వెడుతున్నాను."

"సూర్యా, నిన్ను వొదిలి బతకలేను. నాకు నువ్వు తప్ప యెవరూ వొద్దు. వొస్తాను. తీసుకువెళ్ళు. నిజం, వొస్తాను. కోపంవొచ్చింది నామీద. నేను బతకలేను."

"నాకా కోపం, జానకీ? ఈ ప్రపంచంలో నీమీద కోపమా? కోపం వొస్తే యింకేం? తలుచుకోనైనా లేని నా ప్రేమ మూలానే నిన్ను త్యజిస్తున్నాను. వెళ్ళు."

"వొద్దు నేను వొస్తున్నాను."

బై లుదేరింది.

"పోనీ యీవాళటికి ఆలోచించుకో. రావాలంటే రేపు వొద్దుగానిఏం?"

మాట్లాడకండా పూరుకుంది.

చెయ్యిగట్టిగా పట్టుకుని వొదిలి తల వొంచుకొని వెళ్ళిపోయినాడు.

రోడ్డుచివర తిరిగి చూశాడు. అట్లానే అక్కడే జానకి ప్రతిమవలె నుంచుని వుంది.

## 12

సూర్యనారాయణ రైల్లో కూచున్నాడు. 'ట్రాన్స్‌ఫర్ ఆర్డర్' ఆవాళే వొచ్చింది. రైలు కదులుతోంది. రామారావు పరుగెత్తుకుని వొచ్చాడు.

"సూర్యా, నువ్వు రైలు దిగాలి. దిగు ముందు."

"ఏమిటి?"

"తరవాత చెపుతా"

"ఏమిటి! ముందు చెప్పు."

రామారావు రైలువెంట పరుగెత్తుతున్నాడు.

"జానక్కి జబ్బుగా వుంది. చాలా. ఆదివారం రాత్రి యెందుకో తడిసింది. నిమోనియావొచ్చి సంధి. నిన్నొక్కడే పిలుస్తోంది. దిగు"

దిగకండా యెట్లా! దిగితే తరవాత....

"రా. దిగవేం?"

రామారావు మొహం చూశాడు. దిగాలి తప్పదు. కాని దిగితే, మళ్ళీ జానకి తనపడితే ఆ జబ్బులో! రామారావు గోల! తనని వదలకపోవడం! అబ్బా! కాని, తప్పక వెళ్ళాలి. కిందికి చూశాడు. రైలు వేగం యెక్కువయింది. వీల్లేదు. వెనక్కి చూశాడు. పెదిమలు వణుకుతో, కళ్ళంబడి నీళ్ళుకారుతో యెండలో ప్లాటుఫారంమీద నుంచొని వున్నాడు రామారావు. ఏంచేశాడని పాపం అతని కీగతి! అనుకున్నాడు.

★